సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,4 జూలై 2024


## ప్లాస్టిక్ సంచులు వాడకం పర్యావరణానికి ప్రమాదం - డా.అడ్డాల



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాలలో ప్రపంచ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సంధర్భంగా కాకినాడ ఐడిఎ సభ్యులచే వంద మంది ప్రజలకు గుడ్డ సంచులు అందచేయటం జరిగింది. ఈ సంధర్భంగా రాష్ట్ర ఐడిఎ సిడిహెచ్ కన్వీనర్ డా. అడ్డాల మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం సమస్యపై అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 3న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహిస్తారని, ఇది పర్యావరణ వ్యవస్థలకు, ముఖ్యంగా భూసంబంధమైన మరియు సముద్ర జాతులను ప్రభావితం చేసే ముఖ్యమైన ముప్పును కూడా నొక్కి చెప్పుతుందని, వ్యక్తులు మరియు ప్రభుత్వాలు ఈ ఆందోళనను గుర్తించి ప్లాస్టిక్ వాడకం మరియు కాలుష్యాన్ని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని కోరడం లక్ష్యంగా ప్లాస్టిక్ కాలుష్యం సమస్యపై అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 3న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహిస్తారు అని అన్నారు. ముఖ్యంగా సముద్ర జీవావరణ వ్యవస్థ ప్లాస్టిక్ కాలుష్యం ఫలితంగా తీవ్రంగా నష్టపోతోందని, ఈ ప్లాస్టిక్ కాలుష్యం అత్యంత ప్రమాదకరమైనది అని, ఎందుకంటే ఇది జీవవైవిధ్యంపై విపత్కర ప్రభావాన్ని చూపిస్తున్నదని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ సంచుల నిషేదం వైపు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని, గుడ్డ సంచులు వాడుకోవడం వలన పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. నాగేంద్ర, డా. సిరాజ్, డా. పద్మావతి, డా. శ్రీవల్లి, డా. కార్తీక్, డా. దీప్తి, భవాని, ప్రజలు పాల్గొన్నారు.

# పిఠాపురం ప్రజలకు రుణపడి ఉంటా

- కూటమిని అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు
- పిఠాపురం నియోజకవర్గం ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతా
- త్రాగునీరు, సాగునీరు పుష్కలంగా అందించేందుకు చర్యలు చేపడతాం
- వాలంటీర్ల సహాయం లేకుండానే మొదటి తారీకునే పెన్షన్లు అందించాం
- పిఠాపురం ఎమ్మెల్యే పేరుతో అప్రతిష్ట తేవద్దు
- పిఠాపురం వారాహి బహిరంగ సభలో పవన్‌కళ్యాణ్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని పిఠాపురం ఎమ్మెల్యే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లాలోని మూడు రోజుల పర్యటనలో భాగంగా మూడవరోజు పిఠాపురం బంగారమ్మ రావిచెట్టు సెంటర్లో వారాహి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... తనను అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వనన్నారని, ఎవరు ఊహించని విధంగా భారీ విజయం సాధించామన్నారు.

తను కావాలనే పంచాయతీరాజ్ శాఖను తీసుకున్నానని, ఇప్పటికీ త్రాగునీరు అందని గ్రామాలు ఎన్నో ఉన్నాయని, పిఠాపురం నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో త్రాగు, సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వాలంటీర్లను తీసుకొచ్చిందని, ఇప్పుడు వారి అవసరం లేకుండానే మొదటి తారీకునే ఇంటింటికి పెన్షన్లు అందించామన్నారు. ఇప్పటికే రోడ్లు వేయాలని ఆయన మీ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు అడుగుతున్నారని, పదవి చేపట్టి కొద్దిరోజులైందని, మన దగ్గర అల్లావుద్దీన్ అద్భుతదీపం ఏమీ లేదని వ్యాఖ్యానించారు. ఒక్కొక్క సమస్య క్రమ క్రమంగా తీరుస్తానని, ఒక సంవత్సర కాలంలోనే కోటగుమ్మం రైల్వే గేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించి ఇవ్వాలని అధికారులను ఆదేశించానన్నారు. పిఠాపురంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామని, ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. నేను పిఠాపురం స్థానికుడని అయ్యానని, ఇప్పుడే మూడు ఎకరాలు స్థలం కొనుగోలు చేసి వచ్చానని అందుకే సభకు రావడం ఆలస్యమైంది అన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమికి ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించారని,వాహనాలపై పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా స్టిక్కర్లు వేసుకుని తనకుపార్టీకిఅప్రతిష్టతేవద్దనిజన సైనికులను కోరారు. మనమే తప్పు చేస్తే ఎలా అని, మనం ఒకరికి చెప్పే విధంగా ప్రవర్తించాలని జనసైనికులకు హితవు పలికారు. తాను ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పనిచేస్తానని, తన బిడ్డ ఆచూకీ కనిపించడం లేదని ఒక తల్లి తన వద్ద కన్నీరు పెట్టుకుందని, గత ప్రభుత్వం 9 నెలలు కాలంలో ఆ తల్లికి న్యాయం చేయలేకపోయిందని, తాను అధికారులతో సత్వరమే మాట్లాడి కేవలం తొమ్మిది రోజుల్లోనే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. తాను ఏ పని మీద అయినా దృష్టి పెడితే ఇదేవిధంగా ఉంటుందని, తన ఉపముఖ్యమంత్రి పదవి చేపట్టి కేవలం కొద్ది రోజులు మాత్రమే అయిందని తనకు కొంత సమయం ఇస్తే పిఠాపురంనియోజకవర్గాన్నిఒకమోడల్‌నింగా, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

తన గెలుపునకు సహకరించిన బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కృష్ణంరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మరియు ఇతర నాయకులకు, పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అన్నారు.

**సీఎం సీఎం నినాదాలు...**వారాహి పైనుంచి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తుండగా... జనసైనికులు ఉత్సాహంతో సీఎం సీఎం అంటూ... నినాదాలు చేశారు. సీఎం నినాదాలపై పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... తన పిఠాపురంపర్యటనలోమొదటిసారిగా పురుహూతిగా అమ్మవారిని దర్శించుకున్నప్పుడు అమ్మవారు తనకు.. ముందు ఉపముఖ్యమంత్రి కావాలని ఆదేశించారని, అందుకే ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టానని తెలిపారు. సీఎం చంద్రబాబు అనుభవం ఈ రాష్ట్రానికి చాలా అవసరమని, అందుకే కూటమిగా కలిసి ముందుకు వెళ్లామని, తక్కువ సీట్లు తీసుకున్నా... విజయం సాధించాలని ఉద్దేశంతో పనిచేశామని, ప్రజలు సైతం సహకరించి భారీ మెజార్టీలను అందించారని తెలిపారు.

## హిందువులకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

- మూడే సతీష్ కుమార్ నాయక్



**ఎటపాక, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూడే సతీష్ కుమార్ నాయక్ అధ్యక్షతన బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలో దగ్ధం నిరసన చేయడం జరిగినది. భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు మిట్ట వంశి క్రిష్ణ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధరేశ్వరి సూచనలతో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వారు మాట్లాడుతూ మంగళవారం జరిగిన పార్లమెంటు సమావేశాల్లో కాంగ్రెస్ కూటమి నాయకుడు రాహుల్ గాంధీ హిందువుల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ క్షమాపణ చెప్పాలి అని, లేని పక్షాన ఎక్కడికక్కడ హిందూ సమాజం నిన్ను అడ్డుకుంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చింత దుర్గారావు, బిజెపి నాయకులు కల్లూరి కృష్ణ, మడకం వెంకటేష్, సోడే శేఖర్, కనితి కళ్యాణ్, సోయం వెంకటేష్, కనితి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం కండి

- అధికారులకు కమిషనర్ సూచన
- శాఖలతో సమన్వయ సమావేశం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు అధికారులను ఆదేశించారు. డయేరియా, డెంగీ,మలేరియా వంటి వ్యాధులను నియంత్రించేందుకు తీసుకోవలసిన చర్యలపై ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ ప్రజారోగ్య విభాగాలకు చెందిన అధికారులతో బుధవారం కమిషనర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు తోపాటు వివిధ విభాగాధిపతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై ఆయా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరిచే క్రమంలో వాహనాల మరమ్మత్తులు, డంపర్ బిన్ల రిపేర్లు, అవసరమైన పరికరాలు సమకూర్చుకోవడానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కిల్ వారిగా జరుగుతున్న పూడికతీత పనులపై కమిషనర్ సమీక్షించారు. ఎక్కడైనా అసంపూర్తిగా ఉంటే వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో నగరంలో ఎక్కడా ముంపునీటి సమస్య ఎదురు కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కల్వర్టును పరిశుభ్రం చేసే అంశంపై మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. దోమలను నియంత్రించేందుకు ఫాగింగ్ ప్రక్రియ, డ్రైన్లలో దోమల నియంత్రణ మందులు చల్లడం, ఖాళీ స్థలాల్లో డ్రోన్ పరికరాల ద్వారా దోమల నియంత్రణకు చర్యలు, వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఆయా పనులకు సంబంధించి తక్షణమే అంచనాలను సిద్ధం చేసి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల ప్రభావం ఉంటే ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన సేవలు అందించేలా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ అంశంపై 24 గంటలూ పనిచేసేలా టోల్ ఫ్రీ నెంబర్ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990 నెంబర్కు ప్రజలు కాల్ చేసి సమస్య ఉంటే తెలియజేయవచ్చునన్నారు. ఈ సమన్వయ సమావేశంలో ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వి చరణ్, ఈఈ మాధవి, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, ఏసీపి నాగశాస్త్రులు, డిఈలు, ఏఈలు ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## అన్నవరం కొండపైన సత్యగిరి వేద పాఠశాల విద్యార్థులు తీవ్ర అస్వస్థత



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంనకు చెందిన స్మార్త ఆగమన వేద పాఠశాలలో 36 మంది విద్యార్థులు ఉండగా 15 మందికి డయేరియా సోకినట్లు ఆరుగురికి తీవ్ర అస్వస్థ ఉన్నట్టు గుర్తించి వారిని వైద్యులచే పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనికంతటికి కారణం దేవస్థానంలో పనిచేసే వైఎస్ఆర్సిపి ప్రజాప్రతినిధి అక్రమ సిఫారసుతో ఉద్యోగం వెలగబెడుతున్న ఓ రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగి ఆయన నిర్వహకమే విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు కారణంగా అధికారులు గుర్తించారు. సమాచారం బయటపడకుండా దేవస్థానం అధికారులు చికిత్స అందిస్తున్నారు. అధికారులు సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు దేవస్థానం ఆసుపత్రికి పరుగులు పెడుతున్నారు.

సుమారు15 మంది వరకు అస్వస్థతకు గురి అవ్వడంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వేద పాఠశాలలో డయేరియా రావడంతో అన్నవరం గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. శుచి శుభ్రత ఉన్న దేవస్థానం నడుపుతున్న వేద పాఠశాల నందు డయేరియా రావడానికి అవకాశం లేదని, అధికారుల పర్యవేక్షణలో లోపమని, వేద పాఠశాల పరిసరాలలో ఫారెస్ట్ ఆఫీసర్ గడ్డి మందు ఆ పరిసర ప్రాంతాల్లో వల్ల ఘాటు అయిన వాసన వెదజల్లే మందులు పిచికారి చేయడం వల్ల ఆ గాలిని వేద విద్యార్థులు పీల్చడం వలన అస్వస్థతకు గురైనట్లుగా దేవస్థానం సిబ్బంది గుర్తించినా, దాన్ని దాచిపెట్టి వేరే కారణం చెప్పడానికి ప్రయత్నించడం పట్ల గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేద పాఠశాల నుంచి శివ సదనకి మార్చి అక్కడ వైద్యం అందిస్తున్నారు.

# ఉప్పాడ సముద్రపు కోత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

- సమస్యకు శాస్త్రీయ పరిష్కారం వెతకండి
- ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- మారిటైం బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులతో కలసి తీర ప్రాంతంలో పర్యటన



యు.కొత్తపల్లి,మేజర్‌న్యూస్: పిఠాపురం నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే పనిని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ మొదలుపెట్టారు. ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలను సముద్రపు కోత నుంచి కాపాడే క్రమంలో కార్యచరణకు దిగారు. బుధవారం ఉప్పాడ తీరంతో సముద్రపు కోతకు గురయిన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ మారీ టైమ్ బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వ శాఖ (ఎర్త్ సైన్స్ మినిస్ట్రి) అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. సముద్రపు కోతకు గల కారణాలు, నివారణోపాయాలు వారిని అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ తీరంలోనే సముద్రం ఎందుకు ముందుకు వస్తోంది? దీనికి గల కారణాలు, తీరాన్ని కోతకు గురికాకుండా చేయాల్సిన మార్గాలు అన్వేషించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, దీనిపై శాస్త్రీయంగా సర్వే నిర్వహించి పనులు మొదలు పెడదామని చెప్పారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులకు తగు సూచనలు ఇచ్చారు.

ఉప్పాడ గ్రామ తీర ప్రాంతంలో మొత్తం 84 ఎకరాల విస్తీర్ణంతో భూమి సముద్రంలో కలిసిపోయిందని జిల్లా సర్వేయర్ లక్ష్మీనారాయణ తెలిపారు. 60 ఎకరాలు కోతకు గురయ్యాక సర్వే ప్రారంభించినట్టు, సర్వే ప్రారంభించిన తర్వాత మరో 20 ఎకరాలు సముద్రంలోకి వెళ్లిపోయిన విషయాన్ని వివరించారు. మొత్తం యు.కొత్తపల్లి మండల పరిధిలోని 8 తీర ప్రాంత గ్రామాల్లో 1360 ఎకరాలు కోతకు గురైన విషయాన్ని తెలుసుకుని పవన్ కళ్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చెన్నై నుంచి ఉప్పాడ తీర ప్రాంత కోతపై పరిశోధన జరిపేందుకు వచ్చిన కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులు, మారిటైం బోర్డు అధికారులను సముద్రపు కోతపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ వర్మ, జనసేన సమన్వయకర్త మరెడ్డి శ్రీనివాస్, బీజేపీ ఇంఛార్జ్ కృష్ణంరాజు, జనసేన పార్టీ జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పూల వర్షంతో స్వాగతించిన ఉప్పాడ ప్రజలు...**ఉప్పాడ తీర ప్రాంత కోత సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు అధికారులతో కలసి అధ్యయనానికి వచ్చిన పవన్ కళ్యాణ్ ఉప్పాడ గ్రామ ప్రజలు, తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. మత్స్యకార మహిళలు పూల వర్షం కురిపించి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.











ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉప్పాడ సముద్ర తీరం పరిశీలనకు వెళ్తూ మార్గ మధ్యంలో గ్రామాలలో ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి బుధవారం లక్ష్మి పోలవరంకి చెందిన కొప్పినీడి శ్రీనివాసరావు, సత్యలక్ష్మి దంపతులు మరియు కుటుంబ సభ్యులు రూ.1,11,111లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వామి చరిత్ర గురించి వివరించి దర్శనం చేయించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్ స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## హాస్పిటల్‌లో 'స్టాప్ డయోరియా క్యాంపైన్'



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో 'స్టాప్ డైయేరియా క్యాంపైన్'లో భాగంగా పీ.హెచ్. సిలలో, సి.హెచ్.సి, ఏరియా హాస్పిటల్ లలో మెడికల్ అండ్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా తక్షణ నివారణ చర్యలు చేపట్టింది. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటి వద్ద ప్రజలు జాగ్రత్తలు, నీళ్ల విరోచనాలు, వాంతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా సున్నా నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు, గర్భిణీ స్రిలకు, చంటి పిల్లలు తల్లులకు డయేరియా గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. లక్ష్మి అవగాహన కల్పించారు. పిల్లలు ఏమి తీసుకోవాలి, ఎలా చేతులు శుభ్రం చేసుకోవాలి, మందులు ఏమి వాడాలో పెడియట్రీషియన్ డాక్టర్ ఆదిలక్ష్మి వివరించారు. ఇందులో భాగంగా ఆర్ఏంవో ఇందిర హాస్పిటల్‌లో లభించే మందులు గురించి, తక్షణ చర్యలు, నివారణకు మార్గాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కౌన్సిలర్ ఎన్.వాసు తల్లులు, పిల్లలకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ స్టాఫ్, హెడ్ సిస్టర్స్, డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# సూరప్ప చెరువు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్







**పిఠాపురం, మేజర్‌న్యూస్:** పిఠాపురం నియోజకవర్గం, నాగులాపల్లి వద్ద సూరప్ప చెరువు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్.. అధికారులతో కలిసి పరిశీలించారు. నాబార్డు నిధులతో 22ఎకరాల్లో నిర్మించిన ఈ ట్యాంకుద్వారా యు.కొత్త పల్లి మండల పరిధిలోని 54గ్రామాలకు అందిస్తున్నారు. బుధవారం ఉప్పాడ తీర ప్రాంత సందర్శనకు వెళ్తూ మార్గమధ్యంలో సూరప్ప చెరువును పరిశీలించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, తాగు నీటిని శుభ్రపరిచే విధానం,ల్యాబ్‌లు పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.కాకినాడకలెక్టర్‌షాన్ మోహన్ సగిలి,ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం జనసేన ఇంఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్తూ గ్రామ గ్రామాన ప్రజలను కలుస్తూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. పిఠాపురం, నవకంద్రవాడ, వాకతిప్ప, యు.కొత్తపల్లి తదితర గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దారి పొడుగునా ప్రజలు పవన్ కళ్యాణ్‌కి స్వాగతం పలుకగా అందరికీ అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి వెంట జడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి, ఆర్డబ్ల్యూఎస్- ఎస్ఈఎంవీ సత్య నారాయణ, డీపీవో కె.భారతి సౌజన్య, ఆర్డీవో ఇట్ల కిషోర్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరప్పాడు వెంకన్నను దర్శించుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్



**పెరవలి, మేజర్ న్యూస్ :** అన్నవరప్పాడు గ్రామంలో 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి జూలై మూడవ తేదీబుధవారంఆంధ్రప్రదేశ్ రాష్ట్రకార్మిక శాఖమాత్యులు రామచంద్రపురం నియోజకవర్గ శాసనసభ్యులు వాసంశెట్టి సుభాష్ సందర్శించారు ఆలయ పరిసరాలను గమనించి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ సిబ్బంది ఆలయమర్యాదలతో స్వాగతం పలికి స్వామివారిచిత్రపటమును బహుకరించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీ ఉమా సోమేశ్వర స్వామి వారి ఆలయంనకు వెళ్లి అభిషేకము మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం తోపాటు సోమేశ్వర స్వామి వారి ఆలయం ఇతరఉపాలయాలను దర్శించుకున్నారు.

## వికె.రాయపురం పాఠశాలలో ఎంఈవో తనిఖీలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పాఠశాలల సందర్శనలో భాగంగా సామర్లకోట మండలంలోని వి కె రాయపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి 1 వై శివరామకృష్ణయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రోలు పెంచాలని, ఎన్రోల్మెంట్ డ్రైవ్, ఎన్రోల్మెంట్ ర్యాలీ వంటి కార్యక్రమాలు అమలు చేయాలని హెచ్ ఎం ను ఆయన ఆదేశించారు. పాఠశాల విద్యార్థుల నైపుణ్యాలను ప్రతి తరగతికి వెళ్లి ఆయన పరిశీలించారు. ప్రతి తరగతి విద్యార్థిని, విద్యార్థుల వర్క్ బుక్ కరెక్షన్స్, టెక్స్ట్ బుక్ కరెక్షన్స్, సిలబస్ పరిశీలించారు. విద్యార్థులు అందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా పాఠశాలలో విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక అమలును, నాణ్యతను రుచిచూసి తెలుసుకుని నాణ్యతను మెరుగుపరచవలసిందిగా సూచించారు. ఇంకా పాఠశాలలో అమలవుతున్న విద్యా ప్రవేశ కార్యక్రమాలను, సంసిద్ధత కార్యక్రమాలను, ఉపాధ్యాయుల డైరీస్, లెసన్ ప్లాన్లు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ఆర్ ఓ ప్లాంట్ ను పరిశీలించి శానిటేషన్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పాఠశాల ఎన్రోల్మెంటు పెంపునకై మరింత శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. తనిఖీలో పాఠశాల హెచ్ఎం,వి.సుబ్రహ్మణ్యం, తోటకూర వీర వెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవము




**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** మొదటి శతాబ్దము 52వ సంవత్సరంలో క్రీస్తుప్రభు వారి శిష్యుడైన పరిశుద్ధతో మా ఇండియాకు వచ్చి దేవుని సువార్తను తెచ్చిన సందర్భముగా భారతీయ క్రైస్తవ దినోత్సవము బుధవారం సామర్లకోట మండల పాస్టర్స్ అసోషియేషన్ ద్వారా స్థానిక సంఘ కాపరులు పలు సేవాకార్యక్రమాలు చేపట్టి దేవుని ప్రేమను తెలియజేసారు.

సామర్లకోట గవర్నమెంట్ హాస్పటల్ గర్భిణీ స్త్రీలకు, మరియు రోగులకు ఫ్రూట్స్, బ్రెడ్స్ పంచిపెట్టారు. మరియు బల్లమార్కెట్ నందు రిక్షా కార్మికులకు సెంటర్ నందు, ప్రతిభ స్కూల్ ఏరియాలో ఉన్న వలస ప్రజలకు దుప్పట్లు, బిర్యాని పేకెట్స్ పంచిపెట్టడంజరిగింది. ఈ కార్యక్రమానికి సామర్లకోట మండలం పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం సాల్మన్ రాజు సెక్రటరీ రెవ వి. వంక జాన్ ట్రెజరర్ పాస్టర్ ఆర్. లాజరస్ వైస్ ప్రెసిడెంట్ రెవ చంటి మరియు జయింట్ సెక్రటరీస్ విశ్వాస రావు. రాజు, అసోసియేషన్ కమిటీ సభ్యులు బిషప్ బ్లెసింగ్ సామ్యేల్ రాజు, రెవ రేవ. పాల్, సోనియా పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** స్థానిక రాక్ సిరమిక్స్ పరిశ్రమలో జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ప్రాంతీయ విద్యుత్ అధికారి హెచ్ శాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారూ విద్యుత్ వినియోగం పట్ల భద్రత పాటించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా టైల్స్ ప్లాంట్ హెడ్ వినోద పైక వాసుదేవ, హెచ్ ఆర్ హెడ్ టి నిరజ్ కుమార్ మాట్లాడుతూ గడచిన సంవత్సరాలలో ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా విద్యుత్ భద్రతా ప్రమాణాలను విధిగా పాటిస్తున్న ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ హెడ్ శ్రీనుబాబును, వారి బృందాన్ని భద్రత అధికారి బాలాజీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు శానిటరీ వేర్ హెడ్ చెల్ల దుర్రై, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ విజిఎస్ కుమార్, ఇతర కంపెనీ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## అధికారులపై మండిపడిన ఎమ్మెల్యే రాజప్ప



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండల పరిషత్‌లో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వ పాలకులు అధికారుల వల్లే అభివృద్ధి కుంటుపడిందని, ఇప్పటికైనా అభివృద్ధి కోసం పని చేయాలని ఎమ్మెల్యే చినరాజప్ప అధికారులపై మండిపడ్డారు.

పనిచేయలేని అధికారులు వెళ్లిపోవచ్చును అంటూ కూడా ఎమ్మెల్యే హెచ్చరించడం విశేషం. ఎంపీపీ సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడారు. వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

# మా సమస్యలు పరిష్కరించండి

**- నారా లోకేష్‌కు**
**104 ఎం.ఎం.యు. ఎంప్లాయిస్ యూనియన్ వినతిపత్రం**



**పెద్దాపురం/కాకినాడ, మేజర్ న్యూస్ :** అనేక సంవత్సరాలుగా వైద్య, ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్నామని, కరోనా సమయంలోనూ అనేక ఆరోగ్య ఇబ్బందులను ఎదుర్కొంటూ సేవలందించామని, చాలీచాలని వేతనాలు అవి కూడా నెలనెలా సక్రమంగా చెల్లించడం లేదని, మానవతా దృష్టితో పరిశీలించి మా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 ఎం.ఎం.యు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ 104 యం.యం.యు ఉద్యోగులుగా మేము అనేక సంవత్సరాల నుండి వైద్య, ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్నామని, అనేక ఆరోగ్య ఇబ్బందులను ఎదుర్కొంటూ కోవిడ్ కాలంలో కూడా సేవలందించామని, మాలో ఎక్కువ మంది చాలీచాలని వేతనాలతో, రాష్ట్రంలో ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు కన్నా తక్కువ జీతాలతో పని చేస్తున్నారన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల్లో మాకు వెయిటేజ్ని ఇవ్వకుండా గత ప్రభుత్వం వివక్ష చూపిందని, నెల నెలా సక్రమంగా వేతనాలను చెల్లించలేదని, సమస్యలు పరిష్కరించమని అనేక దఫాలు వినతిపత్రాలు సమర్పించినా సమస్యలు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మీరు మా సమస్యలను మానవతా దృష్టితో పరిశీలించి పరిష్కరించమని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయమని విజ్ఞప్తి చేస్తున్నామంటూ వినతిపత్రాన్ని సమర్పించారు. 104 సేవలను ప్రభుత్వమే పీహెచ్సీ ల ద్వారా నిర్వహించాలని, డిఎస్సి ఆర్జీఆర్ ప్రకారం నియమించబడి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న 326 మందిని వైద్య, ఆరోగ్య మరియు వివిధ శాఖల్లో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా నియమించాలని, గతంలో ప్రభుత్వం చర్చల్లో అంగీకరించిన విధంగా 64 మంది డ్రైవర్లకు స్లాబ్ల ప్రకారం వేతనాలు అమలు చెయ్యాలని, మిగిలిన డ్రైవర్లు, డిఇఓలందర్నీ ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలను నెల నెలా సకాలంలో చెల్లించాలని, చట్ట ప్రకారం యజమాని కట్టాల్సిన పీఎఫ్ వాటాను యజమానితో కట్టించాలని, చట్టప్రకారం అమలు చేయాల్సిన లీవులను అమలు చేయాలని, ప్రభుత్వ సెలవులు వర్తింపచేయాలని, ప్రస్తుతం పనిచేస్తున్నవారికి బదిలీలకు అవకాశం కల్పించాలని, ఆ తర్వాతే నూతన నియామక ప్రక్రియ చేపట్టాలని, ఖాళీలు భర్తీ చేయాలని, బఫర్ ఉద్యోగులకు 26 రోజులకు టీఏ, డీఏ లు ఇవ్వాలని, డిఇఓ, డ్రైవర్లకు ప్రభుత్వ నియామకాలలో వెయిటేజ్ని ఇచ్చి ప్రాధాన్యతను కల్పించాలని, ఇతర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వలే రిటైర్మెంట్ వయసు 60 సంవత్సరాలకు పెంచాలని, 62 సంవత్సరాలకు పెంచే అంశాన్ని పరిశీలించాలని, వాహనాల రిపేర్లు, మెయిన్టెనెన్స్ చేయించాలని, వాహనాలకు ఫిట్‌నెస్ ఇన్సూరెన్సును వెంటనే చేయించాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌కు 104 ఎం.ఎం.యు. ఎంప్లాయిస్ యూనియన్ వినతిపత్రం అందజేశారు. ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ.వి.నాగే శ్వరరావు, అధ్యక్షులు వి.ఆర్ ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హోమియోపతి కాలేజీలో పిజి సీట్లు పునరుద్ధరించాలి

**- కేంద్రమంత్రికి ఎంపీ పురందేశ్వరి విజ్ఞప్తి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) సీట్ల పునరుద్ధరణకై చొరవ చూపిన ఎంపీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు హోమియో కళాశాల సిబ్బంది తెలిపారు. రాజమండ్రిలోని ప్రతిష్టాత్మక శ్రీ అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీలో పిజి సీట్ల పునరుద్ధరించాలని కేంద్ర ఆయుష్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ప్రతాప్ రావు గణపతిరావు జాదవ్‌ని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు, ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రిని కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని బుధవారం ఒక ప్రకటనలో తెలియ చేస్తూ, కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయములో కేంద్ర ఆయుష్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ప్రతాప్ రావు గణపతిరావు జాదవ్ తప్పకుండా సానుకూలంగా స్పందించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తారన్న ఆశాభావాన్ని ఎంపి పురందేశ్వరీ వ్యక్తం చేశారు. డాక్టర్‌లో టీచింగ్ స్టాఫ్ లేకపోవడంతో 2024-25 విద్యా సంవత్సరానికి 23 పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల (3 స్పెషాలిటీలలో) ప్రవేశానికి ఎన్ సి హెచ్, న్యూ ఢిల్లీ అనుమతి నిరాకరించిందన్నారు. ప్రభుత్వం హోమియో మెడికల్ కాలేజ్ & హాస్పిటల్, రాజమహేంద్రవరం తరపున ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ఆయన వెంటనే స్పందించిన ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ లకు కళాశాల తరపున కృత్ఞతలు తెలియచేసారు. కళాశాలకు కావాల్సిన పీజీ సీట్లు కల్పిస్తామని కేంద్ర ఆయుష్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి హామీ తెలపడం, సానుకూలంగా స్పందించడం. పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే సందర్భంగా ఆదిత్య విద్యార్థులచే ఉచితంగా క్లాత్ బ్యాగుల పంపిణీ





కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్. వాటంటీర్లు 'ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే' సందర్భంగా స్థానిక 'డైరీఫారమ్' సెంటర్‌లో ఉచితంగా క్లాత్ బ్యాగులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ &పి.జి కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.ఇ.వి.ఎల్ నాయుడు మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన అని పేర్కొన్నారు. ఒక ప్లాస్టిక్ సంచి భూమిలో కలిసిపోవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది, అదే విధంగా భూమికి హాని చేస్తుంది అని అన్నారు. మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. కరుణ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్‌లు వాడి, ఎక్కడ పడితే అక్కడ పారేయడం ద్వారా భూమి కలుషితం అవ్వడమే కాకుండా నోరులేని మూగజీవాలు కూడా తెలిసి తెలియక వాటిని తిని అనారోగ్యం పాలు అవుతున్నాయని ఆమె అన్నారు. ఇదే విషయం మీద అవగాహన ఏర్పరచడానికి తమ విద్యార్థినులు స్వయంగా తయారు చేసిన క్లాత్ బ్యాగ్స్‌ను డైరీఫారమ్ పరిసరప్రాంతాల ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగశ్రీకాంత్, ఎన్. ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. సురేఖ దేవి, మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల నియంత్రణ దినోత్సవం

**- ప్లాస్టిక్ సంచల వాడకాన్ని అరికడదాం**
**- డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల నియంత్రణ దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల నియంత్రణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత ప్రతి ఒకరి పైన ఉందని, లక్షల టన్నుల ప్లాస్టిక్ వాడుతున్నారని, కుప్పలు తెప్పలుగా పడిఉన్న ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని అన్నారు. ఒకప్పుడు కిరణా షాపులలో, పుస్తకాల షాపులలో కాగితపు కవర్లు వాడేవారని ఆ పరిస్థితులు ఇప్పుడు కనుమరుగయ్యాయని అన్నారు. భూమిలో కరగడానికి వందల సంవత్సరాలు పట్టే ఈ ప్లాస్టిక్ బారినపడి మూగజీవులు ఇబ్బంది పడుతున్నాయని కనుక కనీసం మనం ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ (సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్) వాడకం తగ్గిస్తే భవిష్యత్ తరాలు ఆనందంగా ఉంటాయని అన్నారు. కూరగాయల మార్కెట్కు వెళ్ళినపుడు లేదా సరుకులు కొనడానికి వెళ్ళినపుడైనా గుడ్డతో చేసిన సంచులు లేదా జనపనార సంచులు తీసుకు వెళ్ళడం వలన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థి తమ యొక్క కాలేజీ బ్యాగ్ లలో గుడ్డ సంచిని ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్. బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి ఎన్. సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సి.సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు, ఎల్. దివాకర రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ మెకానిక్ డే



అమలాపురం, మేజర్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శ్రీవరసిద్ధి వినాయక మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ మెకానిక్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికం హరి మనోవికాస కేంద్రంలోని చిన్నారులచే కేక్ ను కట్ చేయించారు. అనంతరం లూయి అంధుల వసతి గృహముల నందు చిన్నారులకు మెకానిక్ సభ్యులచే భోజనములు ఏర్పాటు చేసినట్లు శ్రీ వరసిద్ధి వినాయక మోటర్ సైకిల్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అమలాపురం అధ్యక్షులు గుద్దటి రెడ్డి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటర్ సైకిల్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహారాణి కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.జి.జ్యోతిర్మయి



పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ : పెద్దాపురం మహారాణి కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. జి.జ్యోతిర్మయి బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇప్పటివరకు ఇదే కళాశాలలో బోటని హెడ్‌గా విధులు నిర్వహిస్తూ, పదొన్నతిపై ప్రిన్సిపాల్‌గా విధులలో చేరారు.

ఇప్పటివరకు ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన వీరయ్య చౌదరి జూన్ 30న పదవీ విరమణ చేయడం జరిగింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ డా. జి.జ్యోతిర్మయి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల లెక్చరర్స్, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించిన వారిలో ఉన్నారు.

## పురుషోత్తపట్నం, పుష్కర పంపింగ్ స్కీమ్ ఎత్తిపోతల పథకం ద్వారా

# ఆయకట్టుకు 15 రోజులు ముందుగానే సాగునీటి విడుదల

- గత పాలకులు నిర్లక్ష్యంతో పోలవరం అభివృద్ధి జరగలేదు
- పోలవరం ప్రాజెక్టు కొరకు భూములు ఇచ్చిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది
- జల వనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు

సీతానగరం(పురుషోత్తపట్నం),మేజర్‌న్యూస్ :శివారు ప్రాంతపు ఆయికట్టు వరకు సాగునీరు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డా. నిమ్మలరామానాయుడు పేర్కొన్నారు.బుధవారంసీతానగరమండలం పురుషోత్తపట్నం, పుష్కర పంపింగ్ స్కీమ్ " ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు రైతాంగానికి సాగునీటిని విడుదల చేసే కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ, జ్యోతుల నెహ్రూ వరుపుల సత్య ప్రభ, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతోకలిసి మంత్రి కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. రాష్ట్రఅభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు పురోగతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తెచ్చిరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం అధ్వర్యంలో ముఖ్యమంత్రి కృషి చేస్తారని మంత్రి తెలిపారు. 2014 సంవత్సరంలోరాష్ట్ర విభజనలో జరిగిన నష్టం కంటే



గత ముఖ్యమంత్రి ఐదేళ్ల పాలనలోఅంతకంటే ఎక్కువుగా రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ పర్యటనలో భాగంగా తొలుత జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రాష్ట్రజలవనరులశాఖమంత్రి డానిమ్మల రామా నాయుడుకు పుష్పగుచ్ఛం అందచేసారు.స్థానికశాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రైతాంగానికి రెండు పంటలకు సాగునీరు అందించడం జరుగుతుంద న్నారు. గతంలో కాలువలు పూడికతీత పనులు చేపట్టనీ కారణంగా సక్రమంగా సాగు నీరు లభ్యం కావడం లేదన్నారు. ప్రస్తుతం రైతు సంక్షేమమే ధ్యేయంగా సాగు నీటిని కాలువల ద్వారా అందించాలనే లక్ష్యంతో పూడికతీత పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం కంటే ముందుగానే ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు రైతాంగానికి15రోజుల ముందుగా సాగునీటినందించా మన్నారు. రైతు రాజ్యంగా రైతుల కళ్ళల్లో ఆనందమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పైప్ లైన్ గత ఐదు ఏళ్లుగా నిర్వహణ లేక పోవడం తో విచ్ఛిన్నమైనదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి మరమ్మత్తులు చేపట్టడం ద్వారా 31 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించ వచ్చునన్నారు. జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు అనుకున్న సమయానికి పూర్తిచేసే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉందని ఇందుకు నిదర్శనం ఇప్పటినుంచే ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి సాంకేతిక నిపుణులతో పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలోజిల్లాకలెక్టర్ పి.ప్రశాంతి, శాసనసభ్యులు వరుపుల సత్య ప్రభ, ఇరిగేషన్ ఎస్ ఈ.. బి ఏసుబాబు, ఈఈలు పిడి రంగారావు, సిహెచ్‌కోటేశ్వరరావు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈ ఏడాది జరిగే డిఎస్సీలో ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోస్తాంధ్ర మరియు రాయలసీమ నిరుద్యోగ సంఘం తరపున యు.మౌలాలి, బి.శ్రీదేవి, ఎల్.దేవి భవాని తదితరులు ఆంధ్ర రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద ఎంపి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్‌కి వినతిపత్రం అందచేశారు. నూతన విద్యావిధానంలో వర్క్ ఎడ్యుకేషన్, క్రియేటివ్ ఎడ్యుకేషన్ 4వ ప్రధాన అంశంగా ఉన్నందున ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలిన కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్షమంది ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు డిఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గత 30 ఏళ్ళుగా జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టలేదని, 2018 డిఎస్సీలో మాత్రమే గిరిజన, బిసి వెల్ఫేర్ పాఠశాలల్లో ఖాళీలను టిడిపి ప్రభుత్వ హయాంలో భర్తీ చేశారని చెప్పారు. తమ ఉపాధ్యాయులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ సంఘం తరపున కోరారు.

## విద్యుత్ బిల్లులు చెల్లింపునకు కొత్త నిబంధనలు



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) వినియోగదారులు విద్యుత్ బిల్లు లను ఎపిఇపిడిసిఎల్ వెబ్‌సైట్ మొబైల్ యాప్ ద్వారా చెల్లించ వచ్చునని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృధ్వితేజ్ ఒక ప్రకటనలో తెలియజేశారని పెద్దాపురం ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎ.వి.ఎన్.డి. ఎస్. ప్రభాకర్ తెలిపారు. ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట ఫోన్‌పే, జిపే, పేటిఎం ఇతర యుపిఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేటపుడు ఎపిఇపిడిసిఎల్ పేరు కనిపించదన్నారు. కాబట్టి వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. లేకపోతే సంస్థ వెబ్‌సైటు ఃఃఃఖజూముర్వతీఅజూశీః-వతీ.ఃశీఎ నుంచిగాని బిల్లులు చెల్లించవచ్చునన్నారు. ఎపిఇపిడ సిఎల్ మొబైల్ యాప్‌లోని, సంస్థ వెబ్‌సైటులో గాని బిల్లులు చెల్లించేటపుడు వినియోగదారులు తమ ఫోన్‌పే, జీపే, పేటియం, ఇతర యుపిఐ యాప్‌లతో పాటు, డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్, క్యాష్ కార్డులను వాడుకోవచ్చునని, పృధ్వితేజ్ తెలిపారు.

## కాకినాడ జిజిహెచ్‌లో పేషెంట్‌కు పెన్షన్ అందజేత



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండల అభివృద్ధి అధికారి ఎం.ఉషారాణి ఆదేశాల మేరకు మండల ఇఓ & పిఆర్‌డి నక్కా సత్యనారాయణమూర్తి, పంచాయతీ సెక్రటరీ ఎ.భారతి ఆధ్వర్యంలో మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన మాదిరెడ్డి దుర్గాజీకి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం అక్కడ ఉన్న నేపథ్యంలో గుడివాడ గ్రామ సచివాలయ సిబ్బంది కాకినాడ వెళ్ళి ఫించనుదారుడుకి ఫించను అందజేశారు.

## నేడు శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి జాగరణ ఉత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఎమ్మెల్యే చినరాజప్ప



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి ఆషాఢ మాస జాతర మహోత్సవాలు పురస్కరించుకుని గురువారం జాగరణ మహోత్సవం నిర్వహించబడునని దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి సిహెచ్.రామ మోహనరావు, వంశపారంపర్య ధర్మకర్త ఛైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీలు తెలిపారు. ఈ జాగరణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, పలువురు ప్రజాప్రతినిధులు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈ జాగరణ మహోత్సవంలో జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు, గరగల నృత్యం, కేరళ డ్రమ్స్, తప్పెటగుళ్ళు, పెద్ద పులి ఆట, శూలాల సంబరం, అత్యంత వైభవంగా విద్యుదీపాలరంకరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున ఈ జాగరణ మహోత్సవంలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని వారు తెలిపారు.

## విలీన మండలాల ఆసుపత్రులకు యూడిసిలను నియమించాలని కలెక్టర్లను కలిసిన ఉద్యోగ సంఘాలు



**కూనవరం, మేజర్‌న్యూస్ :** ఆదివాసీ మెడికల్& హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు నేతృత్వంలో చింతూరు ఐటిడిఏ దర్బార్‌లో జిల్లా కలెక్టర్‌ని కలిసి లిముంపు మండలాల పీహెచ్సి లకు యూడిసి లను నియమించాలి అని విన్నవించడం జరిగింది. మూడు సంవత్సరాలనుండి ముంపు మండలాలలో ఉన్న 10 పీహెచ్సి లకు జీతబత్యాల బిల్లులు చేయడానికి కూడా గుమస్తాలు లేక తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నామని మూడు సంవత్సరాలుగా ఎస్సార్ అప్డేట్ చేసే దిక్కు లేదని, సరండర్ లీవ్స్, ఎఫ్టీఏ లు ఇతర ఎలవెన్స్ లు ఏవి అందక తీవ్రంగా ఇబందులు పడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమం లో కేంద్ర సలహాదారులు మడివి నెహ్రూ, ఉపాధ్యక్షులు గుజ్జా సీతమ్మ, సలహాదారులు తుష్టి సీతమ్మ, సూపర్వైజర్లు శ్రీనివాస్, భద్రకాళి,లక్ష్మి, పున్నమ్మ చంద్రమ్మ పాల్గొన్నారు.

## 'లక్ష్య ఇంటర్నేషనల్' పాఠశాలకు ప్రతిష్టాత్మక 'స్వామి వివేకానంద

# ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ కాన్క్లేవ్ అవార్డ్'



కాకినాడ, మేజర్ న్యూస్ : లక్ష్య ఇంటర్నేషనల్ ప్రిన్సిపాల్ వందనా బోహ్రా ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ కాన్‌క్లేవ్‌లో ఏక్ ఉపదేశ్ మీడియా నుండి స్వామి వివేకానంద నేషనల్ ప్రిన్సిపల్స్ అవార్డు 2024 ను అందుకున్నారు. జూన్ 29 న, హైదరాబాద్‌లో స్వామి వివేకానంద ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ కాన్క్లేవ్ అవార్డ్ ఫంక్షన్ ఏక్ ఉపదేశ్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. దీనిలో సుమారుగా ఐదువందల పాఠశాలలకు పైగా పాల్గొన్నాయి. ఈ అవార్డ్ ముఖ్యంగా పాఠశాల ప్రిన్సిపాల్ విభాగంలో ఇవ్వడం జరిగింది. దీని వెనుక ఆమె కృషి, పట్టుదల, నిబద్ధత , వినూత్న విధానం, సృజనాత్మకమైన ఆలోచన, జట్టు నాయకురాలుగా ముందుండి నడిపించడంలో ఆమె అసాధారణ నైపుణ్యాలకు గుర్తుగా ఈ అవార్డ్ ను ఆమెకు అందించారు. సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మెన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ఆమె విద్యార్థులకు మరియు అధ్యాపకులకు ఒకేలా స్ఫూర్తిని ఇస్తూ విద్యారంగం పట్ల ఆమె అచంచలమైన అంకితభావం మరియు నిబద్ధతను ప్రదర్శించారని తెలిపారు. లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలల డైరెక్టర్ డా. నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల కృషి తరచుగా గుర్తించబడదు, కానీ ఈ అద్భుతమైన నాయకులు ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థుల విజయంలో భారీ పాత్ర పోషిస్తారు. అదేవిధంగా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు గాను వారిలో సృజనాత్మకత, నాయకత్వం, సాంఘిక నైపుణ్యాలు పెంపొందించడమే కాకుండా అంతర్జాతీయ విద్యా ప్రణాళిక సాధనలో శ్రేష్టత మరియు విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం చేసే ప్రయత్నం, ఆమె అంకితభావం మరియు ఉత్సాహం విద్యార్థులను సానుకూల దిశలో నడిపిస్తుంది అని తెలియజేసారు. పాఠశాల ప్రిన్సిపాల్ వందన బోహ్రా మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డ్ రావడానికి వెనుక నిరంతరం పాఠశాల అభివృద్ధి కోసం ఈ విద్యాసంస్థ యజమాన్యం, అద్భుత ప్రతిభా పాటవాలు కలిగిన ఉపాధ్యాయులు మరియు ప్రతీఒక్కరు ఎంతగానో కృషి చేస్తున్నారని, వారందరి సమిష్టి కృషి వలెనే ఇటువంటి ఉత్తమ అవార్డు లభించిందని ఆమె తెలియజేశారు.

# వెండితెర ఇలవేల్పు ఎస్వీ రంగారావు

- ఎమ్మెల్యే పంతం - వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో ఘనంగా ఎస్వీర్ జయంతి వేడుకలు
- రంగస్థల నటీమణులకు సత్కారం





**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** విశ్వ నట చక్రవర్తి ఎస్వీ రంగారావు జయంతి వేడుకలు ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ఐదు బిల్డింగ్ సెంటర్ నందు గల ఎస్వీఆర్ కాంస్య విగ్రహానికి, కాకినాడ నాగమల్లితోట జంక్షన్ నందుగల ఎస్వీ రంగారావు విగ్రహానికి కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ముఖ్య అతిథిగా విచ్చేసి ఎస్వీఆర్ విగ్రహానికి గజమాల వేశారు. తదుపరి పెద్దలందరూ జోహార్ ఎస్వీఆర్ జోహార్ ఎస్.వి.ఆర్. అంటూ నినాదాలు చేస్తూ పూలాభిషేకం చేశారు. కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ మీడియాతో మాట్లాడుతూ తెలుగు సినీ జగత్తులో తనకంటూ ఒక ప్రత్యేకతను సృష్టించుకున్న మహానటుడు, దుర్యోధనుడు, ఘటోత్కచుడు, యముడు, కీచకుడు, రావణాసురుడు, భీముడు ఏ పౌరాణిక పాత్రలోనైనా ప్రేక్షకులను మెప్పించగలిగే మహోన్నతుడు ఎస్వీ రంగారావు అని, మూడు దశాబ్దాలుగా 300 చిత్రాలకు పైగా నటించి విశ్వనట చక్రవర్తిగా పేరుగాంచిన మహానటుడు వెండి తెర ఇలవేల్పు ఎస్వీ రంగారావు అంటూ కొనియాడారు. తదుపరి రంగస్థలం నటీమణులకు రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ చేతుల మీదుగా చిత్తజల్లు కృష్ణవేణి (కాకినాడ), దువ్వూరి శేషు కుమారి (కాకినాడ), విజయ (సోనీ) (కాకినాడ), గన్ని నాగేశ్వరి (పిఠాపురం), మహంతి రమణ (తణుకు), డాక్టర్ శిరీష (కాకినాడ) ను పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు. పర్యావరణ పరిరక్షణ సందర్భంగా స్కూల్ చిన్నారులు చేసిన ప్లాస్టిక్ బ్యాగ్ నిషేదించాలి, క్లాత్ బ్యాగులు మాత్రమే వాడాలని చేసిన నినాదం ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో గౌ.అధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, తుమ్మలపల్లి రమేష్ జగ్గంపేట జనసేన ఇంచార్జ్, మాధవరపు పట్టాభి రామయ్య, బాజిబోయిన వెంకటేష్ నాయుడు, సిద్దు నూకరాజు, మాధవరపు తిరుమలరావు, అడపా ప్రకాష్ నాయుడు, రామదేవు సీతయ్య దొర, భావిశెట్టి ప్రసాద్, తుమ్మల పద్మజాలక్ష్మి బిజెపి స్పోక్స్ పర్సన్, భావిరెడ్డి నిరంజన్ నాయుడు, కర్ణాసుల సత్యానారాయణ, నూకల బలరాం, అడబాల సత్యనారాయణ, దొడ్డిపట్ల అప్పారావు, పేర్ని వెంకన్నబాబు, మావులూరి సురేష్, పెమ్మనబోయిన నాగబాబు, తిరుమల శెట్టి సుకుమార్, ఉమేష్, వాసిరెడ్డి జ్యోతి కుమార్, ఎం.లక్ష్మి, మిరియాల హైమావతి, బండి భోగేశ్వరి, రాజ్ కుమారి తదితర కాపు సద్భావన సంఘం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# కాలనీ అసోసియేషన్ల పాత్ర కీలకం - కమిషనర్ జే.వెంకటరావు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజారోగ్య పరిరక్షణ, సమస్యల పరిష్కారంలో రెసిడెంట్ వెల్ఫేర్ సొసైటీల పాత్ర కీలకమని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు పేర్కొన్నారు.స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం కాలనీ అసోసియేషన్‌ల ప్రతినిధులకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అతిసార వ్యాధిపై రూపొందించిన ప్రచార పోస్టర్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నేపథ్యంలో వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నగరపాలక సంస్థ తరపున ఎంతగా ప్రచారం చేసినప్పటికీ స్థానికంగా ఉండే కాలనీ అసోసియేషన్‌ల పాత్ర కూడా ఎంతో ప్రధానమన్నారు.డెంగీ,అతిసార వంటి వ్యాధులనేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు.ఆ మేరకు కరపత్రాలు, ప్రచార పోస్టర్లను కాలనీ అసోసియేషన్లకు నగరపాలక సంస్థ తరపున సమకూరుస్తామని,వాటిని తమ పరిధిలోని స్థానిక ప్రజలకు వివరించి అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలన్నారు. గతంలో లాగే ప్రతి నెలా కాలనీ అసోసియేషన్ల సమావేశాలను నిర్వహించి, స్థానిక సమస్యలను కూడా నగరపాలక సంస్థ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అందుకు తమ వంతు తోడ్పాటు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో 24 గంటలూ పనిచేసేలా టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990 ఏర్పాటు చేస్తామని, ఈ నెంబర్ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, స్మార్ట్ సిటీ ఎస్‌ఈ వెంకటరావు, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్,ఈఈ మాధవి,ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వై.డి.రామారావు, వివిధ పార్క్ అసోసియేషన్ల అధ్యక్ష కార్యదర్శులు, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తమ ప్రాంతాల్లోని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

## జిల్లాలో డయేరియా, సీజనల్ వ్యాధులు నియంత్రణపై వైద్యులు వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలి

- అవసరం మేరకు జింక్,ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలి
- డాక్టర్ ఎన్.వసుంధర



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో అతిసార వ్యాధి కేసులు మరియు సీజనల్ జ్వరాలు వ్యాప్తి నియంత్రణే లక్ష్యంగా వైద్యులు వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎన్ వసుంధర అన్నారు. బుధవారం డిప్యూటీ డిఎంహెచ్వో ఎన్. వసుంధర కోరుకొండ పీహెచ్సీ, తంటికొండ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ను రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ పర్యటనలో భాగంగా ఓ.పి, ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసారు. టీబీ కేసులు, లెప్రసి కేసుల గురించి ఆరా తీశారు.టీబీ, లెప్రసి వ్యాధి గ్రస్థులను కలిసి వారితో మాట్లాడారు. వారికి అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఆశ కార్యకర్తలకు టీబీ గురించి అవగాహనా కల్పించారు.అనంతరం మాట్లాడుతూ వైద్య సిబ్బంది డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రజల కుండా వైద్యులు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి అతిసార వ్యాధి, ఇతర సీజనల్ జ్వరాలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా తంటికొండ నీళ్ల క్లోరినేషన్ టెస్టింగ్ స్వయంగా పర్యవేక్షించారు. ప్రతినెల 10,11వ తేదీలలో లెప్రసి డిపిఎమ్ఆర్ ఆక్టివిటీస్ తప్పని సరిగా జరిగేలా చూడమని సూచించారు. అనంతరం గోకవరంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ విసిట్ చేసి, ప్రాజెక్ట్ ఐరన్ ప్లస్‌లో భాగంగా బాలికల హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించారు.

## పెద్దాపురంలో ఇండియన్ 'క్రిస్టియన్‌డే'

- పాల్గొన్న నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు





**పెద్దా పురం రూరల్, మేజర్ న్యూస్ :** భారత క్రైస్తవ దినోత్సవం సందర్భంగా బుధవారం పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో పెద్దాపురం పట్టణ, సామర్లకోట పట్టణ మండలాలలోని గ్రామాల పరిధిలో దైవజనులు, క్రైస్తవ సోదరి సహోదరులు కలసి అత్యంత ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు డా.జార్జ్‌శ్రీమంతుల, కార్యదర్శి డా.సిహెచ్.సతీష్‌కుమార్, రెవ. డా.విజయ్‌కుమార్, బిషప్ ఎం.ఎస్.గిద్యోను, బిషప్ టి.బ్లెస్సింగ్‌లు మాట్లాడుతూ భారతదేశం క్షేమం కొరకు, భారత ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పెద్దాపురం నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప పాలనలో విభిన్న సంస్కృతులు, సర్వమతాలు శాంతి వర్ధిల్లాలని కోరుతూ ప్రార్ధించడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రవిబాబు, జాన్‌బాబు, విజయ్‌భాస్కర్, గోల్డ్‌స్టోన్, సత్తిబాబు, ప్రేమకుమార్, జయరాజు, శేఖర్, ప్రభుదాస్, ఆశీర్వాదం, సిహెచ్.ఫిలిప్, పి.ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా పెద్దాపురం రీజియన్ (నియోజకవర్గం) ఛైర్మన్ క్లాప్స్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవ.డా.లంక పురుషోత్తమదాస్, జిల్లా వైస్‌ప్రెసిడెంట్ డా.టి.బ్లెస్సింగ్, క్లాప్స్ కన్వీనర్ డా.సిబిఐ సుకుమార్, బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ కుమారుడు పాస్టర్ జి.జాన్‌మోజెస్‌దాస్, క్లాప్స్ ఉపాధ్యక్షులు జి.సత్యానందంల ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో దర్గాసెంటర్‌లో గల మన ఇల్లులో ఆశ్రయం పొందుతున్నవార్కి ఆహారం, క్రిస్టియన్‌పేటలో పాస్టర్ చందూ స్టీఫెన్ నిర్వహిస్తున్న ఆదరణ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రాయులకు ఆహారం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని గల క్లాప్స్ నాయకులు, పలువురు పాస్టర్లు, సేవకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు పురోగతిపై సమీక్ష



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండల పరిషత్ అభివృద్ది అధికారిణి ఎం.ఉషారాణి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథక సిబ్బందికి వారంతపు సమావేశంలో భాగంగా ఉపాధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ఉపాధికూలీలకు పని కల్పించాలని అలాగే హార్టికల్చర్, ప్లాంటేషన్, గృహ నిర్మాణం, 90 రోజుల పనిదినాల గురించి సమావేశంలో సమీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెఇ సుధీర్, టెక్నికల్ అసిస్టెంట్లు దుర్గాప్రసాద్, ఉపాధి హామీ ఫీల్డ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఇటీవల జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ఆత్రేయపురం విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. కిక్ బాక్సింగ్ 36 కేజీల మ్యూజికల్ ఫామ్ ఏ భాగంలో తోటకూర నయన్ వర్మ గోల్డ్ మెడల్ సాధించాడు. అదేవిధంగా క్రియేటివ్ పామ్ గోల్డ్ మెడల్ 16 కేజిల విభాగంలో పాలపర్తి దీక్షిత రాజు మ్యూజికల్ ఫామ్ గోల్డ్ మెడల్, క్రియేటివ్ ఫామ్ గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ టి లక్ష్మీ సందీప్ కిరణ్ తెలిపారు.

ఈ సందర్భంగా రావులపాలెంలో మదర్ తెరెసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టారు వెంకటలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వరద సమయంలో ప్రజలకు సహాయం అందించేందుకు సిద్దంగా ఉండాలి

**చింతూరు,మేజర్న్యూస్ :** ఈ సంవత్సరం వరదలు వచ్చిన వెంటనే ప్రజలకు సహాయపడే విధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది సిద్ధంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.యస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సిబ్బందితో ప్రజలకు వరదలు వచ్చిన వెంటనే సహాయ సహకారాలు అందించేవిధంగా జిల్లా కలెక్టర్ తో పాటు రంపచోడవరం శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష, జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, రంపచోడవరం ఐటీడీఏప్రాజెక్టు అధికారిసూరజ్ గానోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్కుమార్,చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కె.చైతన్య,చింతూరు ఓఎస్డి మహేశ్వర్ రెడ్డి, డీఎఫ్ఓ భవిత ఇరువురు కలిసి వరదలు వచ్చిన వెంటనే ఎదుర్కొనే విధంగా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వరదలకు సంబంధించినహెచ్చరికలు భద్రాచలం నుండి వచ్చిన వెంటనే ముంపు ప్రాంతాల బాధితులకు పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా ఈ నాలుగు మండలాలలో అన్నిశాఖలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.వరద బాధితులకు సహాయ సహకారాలు అందించే విధంగాలాంచీలు,కంట్రీబోట్లుఎక్కడికిఅక్కడ సిద్ధం చేయాలని ఆయన అన్నారు. వరద బాధితులకు రెండు నెలలకు సంబంధించిన రేషన్ మండల స్థాయిలో ముందుగానేతరలించాలనిసంబంధిత అధికారులను ఆయనఆదేశించారు. రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ,గిరిజనసంక్షేమ శాఖ విభాగాలు ఏ మండలాల్లో ఏ ఏ గ్రామాలలో రోడ్డు కనెక్టివిటీ ముంపునాకుగురవుతున్నదిఆయారోడ్లకు సంబంధించిన నివేదికలు తయారుచేసిసమర్పించాలనిఆయన అన్నారు. మత్స్య శాఖకు సంబంధించిన చేపల చెరువులు ఎన్ని ఉన్నవి ఎన్ని గ్రామాలలో ఉన్నవి ఆయా నివేదికల తయారుచేసి సమర్పించాలని ఆయన అన్నారు.



పంచాయతీ శాఖ ద్వారా వరదలు వచ్చినప్పుడు అదేవిధంగా వరదలు తగ్గినప్పుడు ముంపు గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలకు సంబంధించిన పనులు ఏవేవి చేయుచున్నది అదేవిధంగా స్ప్రేయింగ్, బ్లీచింగ్, పాగింగ్ ఈ విధంగా చేయుదురు ఆయన ఆరా తీశారు. వరద బాధితులకు ఏర్పాటు చేసే పునరవాస కేంద్రాలలో త్రాగునీటికి బోర్లు, వాటర్ ట్యాంకులు రిపేర్లు ఉన్నవాటిని వెంటనే రిపేర్ చేయించాలని ఆయన అన్నారు.ముంపు గ్రామాలలో సొంత ట్రాక్టర్లు,సొంత వాహనాలు ఉన్న వాటినిఒకజాబితాతయారుచేసిబాధితుల ఉపయోగపడే విధంగా నివేదికలు సమర్పించాలని ఆయన అన్నారు. జెసిపిలు, ట్రాక్టర్లు ఒక్కొక్క మండలానికి ఎన్ని అవసరమగుచున్నవి ఆయా నివేదికల సమర్పించాలనిఆయన అన్నారు.వరద బాధితులకు సహాయ పడే విధంగా రేషన్ గోడౌనులలో ఎన్ని మెట్రిక్ టన్నులు బియ్యం ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నది ఆయన ఆరా తీశారు. ఫైర్ సర్వీస్ ద్వారా ఎన్ని ఓట్లు ఏర్పాటు చేయుచున్నది ఆయన ఆరా తీశారు. ఏపీ ఈపీడీసీఎల్ ద్వారా వరదలు వచ్చిన వెంటనే ప్రజల ప్రాణనష్టం జరగకుండా ముందుగా కరెంటు తీసివేసి వరదలు తగ్గిన వెంటనే ముంపు బాధితులకు కరెంట్ సరఫరా చేసే విధంగా ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు యాక్షన్ ప్లాన్ తయారు చేసింది ఆయన ఆరా తీశారు. వరద బాధితులకు ఏర్పాటుచేసి పునరావాస కేంద్రాలలో మినీ మెడికల్ క్యాంపులుఏర్పాటు చేయాలని అదేవిధంగా ఏఎన్ఎంల దగ్గర మందులు అందుబాటులో పెట్టుకోవాలని ఆయన అన్నారు. వరద బాధితులకు సంబంధించిన పునర్వాస కేంద్రాలలో ఒక్కొక్క పునరావాస కేంద్రంలో ఒక పోలీస్ కానిస్టేబుల్ను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. పంచాయతీరాజ్, గ్రామ సచివాలయాల సిబ్బంది రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారులు సిబ్బంది కోఆర్డినేషన్తో కలిసి పనిచేయాలని ఆయన అన్నారు. కూనవరం మండలానికి ప్రత్యేక నివేదికలు తయారు చేసే సమర్పించాలని ఆయన అన్నారు.

గత సంవత్సరం వరద బాధితులకు ఏ సహాయ సహకారాలు అందించింది ఎన్ని లాంచీలు ఉపయోగించింది,ఎన్ని ట్రాక్టర్లు ఉపయోగించింది, ఎన్ని మెట్రిక్ టన్నుల బియ్యం బాధితులకు సరఫరా చేసింది, పోలీస్ శాఖ ద్వారా ఏఏ సహాయ సహకారాలు అందించింది, పంచాయతీరాజ్ శాఖ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహించింది. సాటిలైట్ పోన్లు ఏ విధంగాఉపయోగించింది తదితర వివరాలు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, ఐసిడియస్ పీడీ సూర్య కుమారి, డిఎంహెచ్వో జమల్కాన్, డిపిఓ కొండలరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, అంబేద్కర్,జిసిసి డిఎం పార్వతీశ్వరరావు, వెలుగు ఏపీడి శ్రీనివాసరావు, డిఎం సివిల్ సప్లై గణేష్ కుమార్, ఏఎంఓ శ్రీహరి, పిడి దోమ శివయ్య, ఈఈ ఏండి యూసఫ్, సుబ్బయ్య, మురళీకృష్ణ, వెహికల్ ఇన్స్పెక్టర్రాజ్కుమార్,ఏడిఏ చౌదరి, తాసిల్దారులు నజీముల, మౌలానా, ఏపీవో సుజాత, ఇన్స్పెక్టర్ఆఫ్సర్వేదేవేంద్రుడు, ఎంపీడీవోలు, తాసిల్దార్లు వివిధశాఖలకు సంబంధించిన అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలపై కలెక్టర్ను కలిసి వివరించిన ప్రజాప్రతినిధులు



**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం మండలంలోని సమస్యలు పరిష్కరించాలని చింతూరులో కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ ని కలిసి వినతి పత్రం ప్రజా ప్రతినిధులు అందజేశారు. గ్రామాల్లో రోడ్లు మరియు మంచినీటి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ కూటూరు గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకంలో నిధులు మంజూరు చేసి గ్రామానికి మంచినీరు అందించాలని కోరారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉందని సి. సి రోడ్లను మంజూరు చేయాలని కోరడం జరిగిందని తెలియ జేశారు.పెద్దర్కూర్ పంచాయితీలో గండి కొత్తగూడెం బి. టి రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.

రేపాక గ్రామంలో జలజీవన్ మిషన్ ట్యాంక్ ను నిర్మాణంలో ఉందని దానిని త్వరిత గతిన పూర్తి చేసి గ్రామానికి మంచినీరు అందించాలని అన్నారు.అన్ని సచివాలయ పరిధిలో బఫర్ స్టాక్ని ఏర్పాటు చేయాలని కోరారు. వరదల వల్ల ప్రజలు నష్ట పోకుండా చూడాలని అన్నారు.అంతే కాకుండా లింగా పురం రేగుల పాడు గ్రామాల మధ్య వంతెనకూలి పోయిందని దాన్ని పునరుద్దరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ అమ్మాజి, సర్పంచ్ నాగమణి, బొగ్గా వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తొలిసారి పోలవరం సందర్శించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి



**పోలవరం,మేజర్ న్యూస్:** ప్రతిష్టాత్మక పోలవరం భారీ నీటిపారుదల ప్రాజెక్టును జిల్లా కలెక్టర్గా కె.వెట్రీసెల్వి బుధవారం తొలిసారి సందర్శించారు. ఏలూరు నుండి పోలవరం చేరుకున్న కలెక్టర్ తొలుత వ్యూ పాయింట్ నుండి పోలవరం ప్రాజెక్టు నుతిలకించారు. అధికారులతో కలిసి ప్రాజెక్టును, అక్కడ ఉన్న పనులను నిశితంగా పరిశీలించారు.ప్రాజెక్టు పనుల పురోగతిపై ఈఈ పీ.వెంకట రమణ, ఇతర ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు సైట్ లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మోడల్ గ్యాలరీని కలెక్టర్ వెట్రిసెల్వి తిలకించారు. కలెక్టర్ వెంట ఐటిడిఏ పిఓ యం.సూర్య తేజ, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె. అద్దయ్య, తహసీల్దార్ ప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు వున్నారు.

## ఏటిగట్టు పనులు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** నరసాపురం వశిష్ఠ గోదావరి ఏటిగట్టు పటిష్టం చేయడంతో పాటు, వరదలు వస్తే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్గా బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారిగా నరసాపురం విచ్చేసిన జిల్లా కలెక్టర్ సి.నాగరాణి బుధవారం వశిష్ఠ గోదావరి ఏటిగట్టు పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో కోతకు గురైన ప్రదేశాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు.అనంతరం విలేకరులతోకలెక్టర్ మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గంలో జల వనరులశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న డ్రైనేజ్ పనులనుపర్యవేక్షించడం జరిగిందని,పూర్తి నాణ్యతతో నిర్మాణాలుజరుగుతున్నాయని తెలిపారు. ఏటిగట్టు పటిష్టత పనులు చాలా వరకు పూర్తయ్యాయన్నారు. 2022లో 22 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఆకస్మికంగా రావడంతో ఏటిగట్టుకు గండి పడిందని అన్నారు. ఇప్పటికే 24 కోట్ల రూపాయల వ్యయంతో 250 మీటర్స్ రివిట్మెంట్ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట నరసాపురం ఆర్డీవో బి.అచ్యుత్ అంబరీష్, డిఆర్డి ఎపిడి ఎంఎస్-ఎస్ వేణుగోపాల్, నరసాపురం తహసిల్దార్ ఎన్ ఎస్ ఎస్ ప్రసాద్, వశిష్ఠ సబ్ డివిజన్ డిఈగంగుమళ్లశ్రీనివాస్,ఏఈ .కె.సుబ్బా రావు ,వశిష్ఠకుడియేటిగట్టుఏఇఇజి.పవన్కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నిమ్మలకు జిల్లా కలెక్టర్ స్వాగతం

**పోలవరం,మేజర్ న్యూస్:** పట్టి సీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి జలాల ను విడుదల చేసేందుకు బుధవారం పట్టిసీమ విచ్చేసిన రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడుకు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

## బిఎస్సార్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం

**– మెడికల్ క్యాంప్ ప్రారంభించిన ఎమ్మెల్యే డా.కామినేని**

**కైకలూరు,మేజర్న్యూస్:** అఖిలభారత యాదవ యువజన సంఘం అధ్యక్షులు,ఆక్వా ట్రేడర్స్ అధినేత, దినేష్ ఇన్ఫ్రా మేనేజింగ్ పార్ట్నర్ బూరుబోయిన శ్రీనివాస రావు (బిఎస్ఆర్) జన్మదిన వేడుకలు కైకలూరు నియోజకవర్గంలో అట్టహాసంగా జరిగాయి. ప్రథమంగా మండలంలోని లోకుమూడి దత్తాశ్రమం నందు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కైకలూరు వారి ఆధ్వర్యంలో బిఎస్సార్ సౌజన్యంతో జన్మదిన వేడుకలలో భాగంగా ఉచిత వైద్య శిబిరం, స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఎస్సార్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని పేదలకు ఉచిత వైద్య శిబిరం, మరోపక్క అన్నా క్యాంటీన్ దాతగా నిలవడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ రక్తదాన శిబిరంలో వివిధ భాగాలలో చేస్తున్న 11 మంది డాక్టర్లు 400 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయగా 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఎనీ టైం మనీ వ్యవసాయం అలవర్చుకోవాలి

**– జెడి విజయకుమార్**



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** రైతులు ఎనీ టైం మనీ వ్యవసాయం అలవర్చుకోవాలని వ్యవసాయ శాఖ జెడి విజయకుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలం, ఏలేశ్వరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ విజయ్ కుమార్, డీపీఎం ఎలిజరు, మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి పకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జెడి విజయకుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతి తొలి తొలకరి వర్షాలు కంటే ముందు పొడి దుక్కిలో విత్తనాలు చల్లి పంటలు పండించే విధానం అలాగే వాటి అమలు మరియు ఎనీ టైం మనీ అనే పంటల పద్ధతి విధానం వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో పంటల విధానం అలాగే ఎనీ టైం మనీ అనే పంటల విధానం గురించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువులు రసాయనక క్రిమిసంహారక మందులు వాడటం వలన రైతులు ప్రజలు తీవ్ర అనారోగ్యాన్ని గురవుతున్నారని వాపోయారు రైతులు ప్రకృతి వ్యవసాయం పై సాంకేతికను ఉపయోగించి ప్రకృతిలో దొరికే వనరులు ఉపయోగించి పంటల విధానం అవలంబించి ఆరోగ్యకరమైన పంటలను పట్టించాలని కోరారు. అలాగే రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ తదుపరి ఖరీఫ్ సీజన్ గాను వరి పంట నర్సరీల అవలంబించే పద్ధతులు రైతులకు తెలియజేశారు.డీపీఎం ఎలిజర్ మాట్లాడుతూ పకృతి వ్యవసాయంలో ఒక యూనిట్ గా 100 ఎకరాలు బ్లాక్ లో పకృతి వ్యవసాయ పద్ధతి తుల తొలకరి వర్షాలు కంటే ముందు పొడి దుక్కిలో విత్తనాలు చల్లి పంటలు పండించే విధానం పంటలు విధానాన్ని అవలంబించి రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు.ఇందులో ఆకు కూరగాయలు, కూరగాయలు పచ్చిరొట్ట ఎరువులు వంకాయ మొదలగు పంటలు 30 రకాలు సాగు చేస్తున్నారు. దీని వలన రైతులు ఆర్థికంగా లాభాలు ఆర్జించవచ్చు అని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులను ద్వారా పంటలను పండించాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్ ఎన్ . విజయ్ కుమార్, డీపీఎం ఎలీజర్ పకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు కర్రీ బుజ్జి, అరుణ, చిన్ని బాబు, రాజారత్నం, సత్యనారాయణ వెంకటలక్ష్మి,బూరమ్మ ఎంపీఈవో దివ్య, కె. సింహాద్రి రైతులు తదితరులు పాల్గొన్నారు.


## రహదారుల వెంట పచ్చదనం అభివృద్ది చెయ్యాలి


**– పెండింగ్ పనులపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి – కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్:** పర్యావరణపరిరక్షణనుదృష్టిలోఉంచుకొని రాజమహేంద్రవరం నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారులకు ఇరువైపులా పచ్చదనంతో కూడిన గ్రీనరీ అభివృద్ధి ని చేసే విధంగా జాతీయ రహదారుల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పిప్రశాంతి సూచించారు.బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఛాంబర్లో జాతీయ రహదారులు, ఆర్అండ్బి తదితర శాఖల అధికారులతో కలెక్టర్ పి. ప్రశాంతి రహదారుల అభివృద్ధి పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాజమహేంద్రవరంనగరంలో జాతీయరహదారులుఎన్.హెచ్-16,ఎన్.హెచ్-216 ప్రారంభం నుండి చివరి వరకు రహదారులు ఇరువైపులా ఆహ్లాదాన్ని కలిగించే పచ్చదనంతో కూడిన గ్రీనరీలనుఏర్పాటు చేసి అభివృద్ధిచేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా తూర్పు గోదావరి జిల్లా సరిహద్దులను ప్రజలకు తెలియజేసే విధంగా బోర్డులు పెట్టాలని సూచించారు. భూ సేకరణ పెండింగ్ లేకుండా తీసుకోవాలని అన్నారు.మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. ఆగస్టు చివరి నాటికి వంతెన ట్రాఫిక్కు అనుమతించే విధంగా సిద్ధం చేయనున్నట్లు వివరించారు. రాజానగరం ప్రాంతంలో ఏడీబి రోడ్డుకు చెందినా పనుల పురోగతి పై వివరాలు తెలియ చేసారు.ఈ సందర్భంగా జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ డి.సురేంద్రనాథ్ వివరిస్తూ జాతీయ రహదారులకు సంబంధించి లాలాచెరువు, ఐటీసీ జంక్షన్ బొమ్మూరు, వేమగిరి లలో ఫ్లైఓవర్ నిర్మాణం, సర్వీస్ రోడ్స్, లైటింగ్ సంబంధించి రూ.345 కోట్లు ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా గామన్ జంక్షన్ దివాన్ చెరువు వరకు 2.4 కి.మీ. ఫ్లై ఓవర్ నిర్మాణం కొరకు రూ.141 కోట్లు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించగా, ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో టెండర్లు ప్రక్రియ కూడా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్ అండ్ బి జిల్లా రోడ్డు రహదారుల అధికారి ఎస్ బి వి రెడ్డి, జాతీయ రహదారుల ఆధారటి ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. సురేంద్రబాబు, ఆర్డీబీ ఈ ఈ శ్రీకాంత్, తదితరులు హాజరయ్యారు.

## ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి





**– జై భారత్ క్షీరారామ సంఘం అధ్యక్షులు గాంధీ భగవాన్ రాజు**

**పాలకొల్లు,మేజర్ న్యూస్:** జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో పూలపల్లి త్రిపుల్ ఎస్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఆక్వా రైతుల మహాసభ భుదవారం జరిగింది. జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గాంధీ భగవాన్రాజు సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆక్వారైతుల సమస్యలను, కౌలు రైతుల మహా సభ వేదికగా అడిగి తెలుకున్నారు. ఆక్వా రైతులు కష్టపడి పండించిన పంటను బ్రతిమలాడుకుని అమ్ముకోవాల్సి పరిస్థితులు నేడు వుండడం దురదృష్టకరమని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డూప్లికేట్ సీడ్ ఉత్పత్తి చేసే హేచరీస్ పై సంభదిత అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఇప్పటివరకూ ఎలాంటి హేచరీని ఒకటైనా ఉందా అని పలువురు ఆక్వా రైతులు ప్రశ్నించారు. అసలు పర్యవేక్షణ చేయాల్సిన ఎంఫెడా ఏం చేస్తోందో చెప్పాలన్నారు. సంఘ అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా రైతుల ప్రతి సమస్యను తప్పక పరిష్కరిస్తామని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులకు తప్పకుండా న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేసారు. త్వరలోనే ఆక్వా రైతుల సమస్యలు జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆద్వర్యంలో పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. సంఘం కార్యదర్శి బోణం చినబాబు, అల్లూరి సత్యనారాయణ రాజు,కర్నేన గౌరు నాయుడు, కోడి విజయభాస్కర్, మేడిది జాన్ డేవిడ్ రాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, సజ్జా బుజ్జి,పెన్మెత్స రామభద్రరాజు, చంటిరాజు, వీరవల్లి చంద్రశేఖర్, బలభద్ర రాజు, పెద్ద సంఖ్యలో ఆక్వా రైతులు పాల్గొన్నారు.

## పెదమైనవాని లంకను సందర్శించిన జిల్లా కలెక్టర్

**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్:** కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామం పెదమైనవానిలంకలోని డిజిటల్ కమ్యూనిటీ భవనాన్ని జిల్లా కలెక్టరు సి.నాగరాణి పరిశీలించారు. బుధవారం డిజిటల్ భవన్ నందు జరుగుతున్న శిక్షణలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఎంత మంది శిక్షణ పొందారు, ప్రస్తుతం ఎన్నో బ్యాచ్ నడుస్తుందని తెలుసుకొని, వారికి శిక్షణ అనంతరం అందించే టూల్ కిట్స్, శిక్షణ కాలంలో అందించిన స్టైఫండు వివరాల రిజిస్టర్లును,కంప్యూటర్ల డేటాను పరిశీలించారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ధ్రువపత్రాలను జిల్లా కలెక్టరు అందజేశారు. అక్కడ ఉన్న శివాలయాన్ని జిల్లా కలెక్టరు సి.నాగరాణి దర్శించడం జరిగింది. జిల్లా కలెక్టరు వెంట నరసాపురం ఆర్డీవో యం. అచ్యుత అంబరీష్, డిఆర్డిఏపిడియం. యస్.యస్.వేణుగోపాల్, తహాశీల్దారు యన్.యస్.యస్.ప్రసాదు, డిజిటల్ భవనం సూపర్వైజర్లు,సిబ్బంది,శిక్షణ పొందుతున్న యువతీ, యువకులు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే బొలిశెట్టి నివాసం వద్ద ప్రజా దర్బార్



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నివాసం వద్ద బుధవారం ఉదయం నుంచి ప్రజాదర్బార్ నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి వందలాదిగా వచ్చిన ప్రజలు వారి సమస్యలను చెప్పుకుంటూ పరిష్కారం కోసం అభ్యర్థించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మున్సిపల్ అధికారులను,పోలీస్ అధికారులను రప్పించి వారి సమస్యలు వెంటనే పరిష్కారం చేసే దిశగా అడుగులు వేశారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటికి వాయిదాలు లేకుండా పరిష్కరించాలని అధికారులనుఆదేశించారు.

ముఖ్యంగా పట్టణంలోని మంచినీరు, పారిశుధ్యం, గత ప్రభుత్వం కేటాయిం చినకాలనీలో సమస్యలుఎమ్మెల్యేదృష్టికి తీసుకు వెళ్లారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఇతర శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.